WGL YAKUBI AV

ఎవరూలేని అనాథలకు అమ్మ... నిలువనీడలేని వృద్ధులకు కొండంత అండ... అభాగ్యులకు ఒక ఆత్మీయ స్పర్శ... ఆమే... యాకూబీ.

ఏ ఆసరా లేనివారు అమ్మా అని పిలిస్తే నేనున్నానంటూ ముందుకొస్తారు యాకూబీ. వృద్ధులు, అనాథలు, అభాగ్యులను అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పిస్తారు. ఒక మహిళ కావడం, ముస్లిం మతస్తురాలు కావడం... ఇవేమీ యాకూబీ సేవామార్గానికి అడ్డుకాలేదు. వాటి పేరుతో అడ్డు చెప్పినవారి మాటలను ఆమె లెక్కచేయలేదు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అని నమస్ఫూర్తిగా నమ్మి దీనుల సేవకు అంకితమయ్యారు.

వరంగల్ అర్బన్ జిల్లాలోని కాజీపేట్‌లో అనాథలు, వృద్ధుల కోసం 2007లో సహృదయ పేరుతో ఓ ఆశ్రమం స్థాపించారు యాకూబీ. ఇందులో 78 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో సహృదయ యాకూబీ అంటే తెలియనివారు చాలా తక్కువ. దాతల సహకారంతో ఆశ్రమం నడిపిస్తున్న యాకూబీ... భర్త, కుటుంబ సభ్యుల తోడ్పాటుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అందరూ ఉండి నిరాదరణకు గురైనవారు, నిలువ నీడలేనివారు, అనాథల గురించి ఎవరైనా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే చాలు... వెంటనే వెళ్లి వారిని దగ్గరుండి ఆశ్రమానికి తీసుకొస్తారు యాకూబి. ఎంతో ప్రేమగా వారి బాగోగులు చూసుకుంటారు. వివరాలు సేకరించి కుటుంబ సభ్యులతో మాట్లాడి వాళ్లను కలపడానికి ప్రయత్నిస్తారు. అలాంటి అవకాశం లేని పరిస్థితుల్లో వారికి ఆశ్రమంలోనే నీడ కల్పిస్తారు.

బతికున్న అనాథలకే కాదు... అంతిమ సంస్కారాలకు నోచుకోని అనాథ శవాలకు కూడా ఏ లోటూ రానివ్వరు యాకూబి. దగ్గరుండి దహన సంస్కారాలు నిర్వహిస్తారు. చనిపోయినవారి వివరాలు తెలుసుకుని వారి మతాచారం ప్రకారమేఅంతిమ సంస్కారం జరిపిస్తారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు ప్రేమా అప్యాయతలను పంచి ఏ లోటూ రాకుండా చూసుకుంటారు. బంధాలు, అనుబంధాలకు విలువలు కరువైపోతున్న ఈ రోజుల్లో... ఒకే ఇంట్లో ఉంటూ ఎవరివారై బతుకుతున్న సమాజంలో... దిక్కులేని వారికి తానే ఒక దిక్కయి, మానవత్వానికి ఒక దిక్సూచిగా మారారు యాకూబీ. సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ -2016 యంగ్ అచీవర్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డుతో యాకూబీని సత్కరించిడం... గౌరవంగా భావిస్తోంది సాక్షి.